# బీఆర్ఎస్‌లో పోటెత్తిన చేరికలు

- వివిధ పార్టీలు.. సంఘాల నాయకుల చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఈశ్వర్

ధర్మపురి/ధర్మపురి రూరల్, నవంబర్ 14: ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి నాయకులు క్యూ కడుతున్నారు. రోజురోజుకూ భారీ సంఖ్యలో ఆ పార్టీని వీడుతున్నారు. మంగళవారం మండలంలోని తుమ్మెనాల గ్రామం నుంచి దాదాపు 30 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఈశ్వర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్ర భుత్వం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను ప్రజలకు కార్యకర్తలు వివరించాలన్నారు. తెలంగాణ వచ్చాక జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ పాలనలో పడ్డ కష్టాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఏడు దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్ రాష్ర్టాన్ని అధోగతి పాలు చేసిందని విమర్శించారు. సరిపడా కరెంట్ లేక పడ్డ గోసను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ప్రతి గ్రామంపై దృష్టి సారించి వందల కోట్లు కేటాయించి అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తానన్నారు. ఇక్కడ నాయకులు తదితరులున్నారు.

## లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నాయకులు

గొల్లపల్లి, నంవంబర్14; మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు యువకులు మంగళవారం మంత్రి సమక్షంలో పెగడపల్లిలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. లక్ష్మీపూర్ 1వ వార్డు సభ్యుడు బాలయ్య, 4వ వార్డు సభ్యుడు మాట్నీ తిరుపతి, గొల్లపల్లి మండల బీజేవైఎం ఇంచార్జీ ఆకుల కనకరాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు 100 మంది తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధిని కాంక్షిస్తూ బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.

## గుల్లకోట, గొడిసెలపేట గ్రామాల నాయకులు

వెల్గటూర్, నవంబర్ 14: ఎండపల్లి మండలంలోని గుల్లకోట, గొడిసెలపేట గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు యువకులు బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరారు. కాగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుల్లకోట నుంచి 40 మంది, గొడిసెలపేట నుంచి 30 మంది యువకులు చేరారు. కార్యక్రమంలో ముస్కు దేవేందర్‌రెడ్డి, తిరుపతి, మల్లేశ్, రవి, శ్రీనివాస్ తదితరలు ఉన్నారు.



గొల్లపల్లి: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్



వెల్గటూర్: మంత్రి కొప్పుల సమక్షంలో పార్టీలో చేరిన గొడిసెలపేటకు చెందిన యువకులు

# అభివృద్ధిని చూసి కారుకు ఓటేయండి

- మంత్రి కొప్పుల ఈశ్వర్ కూతురు నందిని
- ధర్మారంలో విస్తృత ప్రచారం



ధర్మారంలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలు పంచుతూ ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి కూతురు నందిని

ధర్మారం,నవంబర్14: మండలంలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు కారు గుర్తుకు ఓటేయాలని మంత్రి ఈశ్వర్ కూతురు నందిని కోరారు. మంగళవారం ధర్మారంలోని గణేశ్‌నగర్, లంబాడీతండా, వారసంతలో జడ్పీటీసీ పూస్కూరు పద్మజ, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నందిని మాట్లాడుతూ మంత్రి కొప్పుల ప్రజల ఆశీర్వాదంతో వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్నింటా ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించారని చెప్పారు. మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. ఇక్కడ సర్పంచ్ పూస్కూరు జితేందర్ రావు, ఏఎంసీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతి, ఎంపీటీసీ –1 తుమ్మల రాంబాబు, ఆర్‌బీఎస్ జిల్లా సభ్యుడు పూస్కూరు రామారావు, క్లస్టర్ సభ్యుడు దేవి రాజలింగయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండి రఫీ,ఉప సర్పంచ్ ఆవుల లత, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ బోర్డు సభ్యుడు జైన రాజమౌళి, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షులు బాస తిరుపతి రావు, దేవి లావణ్య, కాంపల్లి అపర్ణ, మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నాడెం శ్రీనివాస్, గాజుల రాజు, దేవి నళినీకాంత్, దేవి వంశీక్రిష్ణ, బీఆర్ఎస్వి నియోజకవర్గ సమన్వయకర్త సల్వాజి మాధవరావు, నేతలు దేవి రాజేందర్, బండవరం సుమన్, బొల్లి శశిధర్, అర్ధవెల్లి రాము పాల్గొన్నారు. కాగా పైడి చింతలపల్లిలో ఎంపీపీ కరుణశ్రీ, నంది మేడా రం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి అధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు.

## మంథని రిటర్నింగ్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు

మంథని, నవంబర్ 14: మంథనిలోని ఆర్‌వో కార్యాలయాన్ని ఎన్నికల జనరల్ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి సీఎన్. శ్రీధర్, కేంద్ర వ్యయ పరిశీలకులు, ఐఆర్ఎస్ సునీల్ శ్రీవాత్సవ మంగళవారం సందర్శించారు. నియోజకవర్గంలో పోలింగ్‌కు ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా, ఓటర్ స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ , డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లోని ఏర్పాట్లు, దివ్యాంగులు, 80 ఏండ్లు పైబడిన వారు ఓటు వేసేందుకు చేస్తున్న ఏర్పాట్లపై ఆర్‌వో హనుమానాయక్‌తో చర్చించి సూచనలిచ్చారు. ఫిర్యాదులు ఉంటే ఎన్నికల జనరల్ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆర్‌వో తెలిపారు. 812568 4450కు ఫోన్ లేదా మెసేజ్ చేయవచ్చన్నారు. తహసీల్దార్ రాజయ్య, మీడియా సెల్ అధికారి రవీందర్ ఉన్నారు.

## కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు

ధర్మపురి రూరల్, నవంబర్ 14: ధర్మపురిలో కేంద్ర సాయుధ బలగాలు 200 మంది సిబ్బంది మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీమ్‌రావ్ జెండా ఊపి ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభించగా.. పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదు గా కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. ఎన్నికల నిర్వహణకు బీఎస్ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలు చేరుకున్నాయని, ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీంద్రకుమార్, బీఎస్ఎఫ్ డీఎస్పీలు సురేశ్, డిపాన్‌కర్, ధర్మపురి సీఐ రమణమూర్తి, ఎస్ఐలు దత్తాద్రి, నరేశ్, సందీప్, శ్వేత, సిబ్బంది ఉన్నారు.

## నేడు ప్రజా ఆశీర్వాద యాత్ర ..

ధర్మారం, నవంబర్ 14: ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద యాత్రకు ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరవుతారని నందిమేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కమ్మర్‌ఖాన్‌పేట గ్రామంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని, కొప్పుల ఈశ్వర్ హాజరై ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తారని వివరించారు. ఆ తర్వాత ధర్మారంలో మంత్రి సమక్షంలో చేరికలు ఉంటాయని వారు వివరించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు లంబాడీ తండా (బి), 3 గంటలకు కొత్తూరులో జరిగే ప్రజా ఆశీర్వాద యాత్రలో మంత్రి ఈశ్వర్ పాల్గొంటారని వివరించారు.

## షీ టీం సేవలపై అవగాహన




చిల్వాకోడూర్ పాఠశాలలో షీ టీం బృందం ప్రదర్శన

గొల్లపల్లి, నవంబర్ 14: చిల్వాకోడూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు షీ టీం, ఏహెచ్‌టీయూ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జిల్లాలో మహిళల హక్కులు, రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పని చేస్తుందన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీ టీం నంబర్ 8712670783కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు యమద్వితీయ పూజలు

ధర్మపురి, నవంబర్ 14: ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామివారి దేవాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీయమధర్మరాజు స్వామివారి ఆలయంలో బుధవారం యమద్వితీయ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఉదయం వేళలో పండితులు మంత్రోచ్ఛారణల మధ్య పంచోపనిషత్తులతో అభిషేకం, ఆయుష్యహోమం, హారతి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు.

## పలు పాఠశాలల్లో చిల్డ్రన్స్ డే వేడుకలు

వెల్గటూర్, నవంబర్ 14: వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విద్యార్థులు స్వయం పరిపాలన చేపట్టారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.